సాక్షి
వైఎస్సార్ జిల్లా
గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



పాలకవర్గం పట్టు..

మున్సిపల్ పాలకవర్గం పట్టుబట్టి భీష్మించగా.. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తన బెట్టు వదలి రెండో రోజున బుధవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. -8లో



గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ

జమ్మలమడుగు–తాడిపత్రి రహదారిపై ఓ లారీ భీబత్సం సృష్టించింది. వేగంగా వస్తూ రహదారిపై వెళ్తున్న గొర్రెల మంద పైకి దూసుకెళ్లింది. -8లో

గరిష్టం/కనిష్టం
35.6/27.2

వాతావరణం

జిల్లాలో బుధవారం 27.2 - 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేటి నుంచి సెలవులో కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తన వ్యక్తిగత పనుల మీద లండన్ వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు అనుమతులు మంజూరు చేసింది. గురువారం నుంచి ఈనెల 18 వరకు ఆయన సెలవులో ఉంటారు. అంతవరకు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా వ్యవహరిస్తారు.

నేడు కౌన్సెలింగ్

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్–4 పరిధిలో ఈనెల 11వ తేది ఉదయం 10 గంటలకు కాంట్రాక్టు స్టాఫ్ నర్స్ నియామకాల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ బి.రామగిడ్డయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.హెచ్‌ఎంఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కడప పాత రిమ్స్‌లోగల కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి ఎంపికలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఎస్‌జీఎఫ్ అండర్ 19 ఉమ్మడి కడప జిల్లా జట్ల ఎంపికలు గురువారం నుంచి నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్–19 కార్యదర్శి చంద్రమోహన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు విధిగా వయో ధ్రువీకరణ, స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. అభ్యర్థులు నిర్దేశించిన మైదానాలకు ఉదయం 8 లోపు చేరుకోవాలన్నారు. 11వ తేదీ వైఎస్‌ఆర్ క్రీడా పాఠశాలలో స్విమ్మింగ్, బాక్సింగ్, 12న ఆర్చరీ, ఫుట్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్, జిమ్నాస్టిక్ ఉంటాయన్నారు. డీఎస్‌ఏలో, వల్లూరు ఏపీ మోడల్ స్కూల్‌లో పలు పోటీలు జరుగుతాయని వివరించారు.

పోలీస్ శాఖకు సోన్యూ జాగిలం



జాగిలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీఅశోక్‌కుమార్

కడప అర్బన్: కేసుల ఛేదనలో, నేరస్థులను గుర్తించడంలో జిల్లా పోలీస్ శాఖ మరింత బలోపేతం అయ్యేందుకు నూతన జాగిలం 'సోను' జిల్లా పోలీస్ శాఖకు వచ్చిందని ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ తెలిపారు. 'సోను' అనే బెల్జియం మలనాయిస్ జాతికి చెందిన నూతన జాగిలం మంగళగిరి హెడ్ క్వార్టర్స్ 6వ బెటాలియన్ (కెనైన్ ట్రైనింగ్ సెంటర్) లో 10 నెలల పాటు శిక్షణ పొందిందని పేర్కొన్నారు. కాగా ప్రస్తుత జాగిలానికి రెండు అంశాల్లో ప్రావీణ్యత పొందేలా తర్ఫీదు (డ్యూయల్ ట్రైనింగ్) ఇచ్చారని ఎస్.పి వివరించారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన జాగిలం 'సోను'ను ఎస్పీ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాగా ఈ జాగిలంతో మొత్తం డాగ్ స్క్వాడ్ సంఖ్య 9కి చేరుకుందన్నారు. ఆర్.ఐ శివరాముడు,ఆర్.ఎస్.ఐ వెంకటేశ్వర్లు, డాగ్ స్క్వాడ్ ఇంచార్జ్ ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుల్‌సునీల్ కుమార్, హ్యాండ్లర్స్ సుదీర్ రాజా, శివకుమార్ పాల్గొన్నారు.

దేశంలో రగడ!





- పుత్తా వర్సెస్ రెడ్డెమ్మ వర్గీయుల బలప్రదర్శన
- నూతన బార్ ఏర్పాటును అడ్డుకున్న కడప ఎమ్మెల్యే వర్గీయులు
- పరస్పర సవాళ్ల నేపథ్యంలో తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయం



సాక్షి ప్రతినిధి, కడప: కడప తెలుగుదేశం పార్టీలో అసమ్మతి పోరు ముదిరింది. కడప కేంద్రంగా పరస్పర బలప్రదర్శనల జోరు ఊపందుకుంది. ఇరుగుపొరుగు నియోజకవర్గాలైన కమలాపురం కడప ఎమ్మెల్యేలు, నేతల మధ్య రగడ తీవ్ర స్థాయికి చేరింది. వరుస వివాదాల నేపథ్యంలో ఏకంగా టీడీపీ జిల్లా అధ్యక్ష పీఠానికి ఎసరు పెట్టారు. అధ్యక్షుడు మార్పు జరగాల్సిందేనంటూ ఓ వర్గం పట్టుబట్టడం గమనార్హం.

- జిల్లా కేంద్రమైన కడపలో మునుపెన్నడూ లేని పరిస్థితులు కూటమి సర్కార్ 16 నెలల కాలంలో తెరపైకి వస్తున్నాయి. 'మద్యం వ్యాపారం మా వర్గీయులే చేయాలంటూ' స్థానిక ఎమ్మెల్యే వర్గీయులు అది నుంచి హుకుం జారీ చేయసాగారు. ఫలితంగా ముప్పై ఏళ్లుగా మద్యం వ్యాపారంలో కొనసాగుతున్న లక్ష్మిరెడ్డికి చెందిన రెండు బార్లు బలవంతంగా స్వాహా చేశారు. తాజాగా 27 బార్ల లైసెన్సుకు ప్రభుత్వం టెండర్లు ఆహ్వానిస్తే 14బార్లకు మాత్రమే టెండర్లు దాఖలయ్యాయి. మిగతా 13 పెండింగ్‌లో ఉన్నాయి. అందులో జిల్లా కేంద్రమైన కడపలో 4బార్లు పెండింగ్‌లో ఉన్నాయి. 9 టెండర్లలో పలువురికి దక్కాయి. అందులో యల్లటూరు విశ్వనాథరెడ్డికి ఓ బార్ దక్కింది. కోటిరెడ్డి సర్కిల్ సమీపంలో బార్ ప్రారంభోత్సవానికి ప్రయత్నించగా..కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. ఇక్కడ బార్ పెట్టొద్దంటూ హంగామా చేశారు. ఇరువర్గాలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం, ఇంతలోనే కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి బ్యానర్లతో కూడిన వాహనాల్లో కొంతమంది అక్కడి చేరుకోవడంతో వాతావరణం వేడెక్కింది. ఇరువర్గాలు పరస్పర సవాళ్లు చేసుకున్నారు. కాసేపటికే అక్కడి నుంచి జారుకున్న కడప ఎమ్మెల్యే వర్గీయులు.. బుధవారం రాత్రి సదరు బార్ అండ్ రెస్టారెంట్ నేమ్‌బోర్డును ధ్వంసం చేసినట్లు సమాచారం. కాగా, జిల్లా కేంద్రంలో మాధవి, వాసు నియంతృత్వ పోకడలకు చెక్ పెట్టాలనే దిశగా తెలుగుదేశం పార్టీ నేతలు అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

టీడీపీ అధ్యక్ష పీఠానికి ఎసరు



శ్రీనివాసులరెడ్డి

జిల్లా కేంద్రమైన కడపలో ఏకపక్ష చర్యలకు చెక్ పెట్టాలని తెలుగుదేశం పార్టీలో కొంతమంది నడుం బిగించారు. అడ్డదిడ్డంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో టీడీపీ జిల్లా అధ్యక్ష పీఠం మార్పు చేయాలనే దిశగా అడుగులు వేస్తున్నారు. ఎమ్మెల్యే మాధవిరెడ్డికి తోడుగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఉండడంతో ప్రజాస్వామ్య పరిస్థితులను కాలరాస్తున్నారని కొంతమంది టీడీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఆమేరకు ఇటీవల చోటుచేసుకున్న కొన్ని సంఘటనలను ఉదహరించినట్లు తెలుస్తోంది. పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసులరెడ్డికి రెండు పదవులు ఉన్న నేపథ్యంలో అధ్యక్ష పీఠం తప్పించాలని కోరినట్లు సమాచారం. ఆమేరకు టీడీపీ అధిష్టానం సైతం ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. కాగా, జిల్లా అధ్యక్షుడిగా ఎవరైతే బాగుంటుందనే అన్వేషణలో జమ్మలమడుగు ఇన్‌చార్జ్ చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పేరును ప్రతిపాదించినట్లు సమాచారం. టీడీపీలో భూపేష్‌రెడ్డి అందరికీ ఆమోదయోగ్యుడుగా నిలువనున్నట్లు అధిష్టానం అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.

పెండింగ్‌లో కడప సిటీ కమిటీ

టీడీపీ సీనియర్ నేతల ఫిర్యాదు మేరకు ఆ పార్టీ కడప సిటీ కమిటీ నియామకం పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం. పఠాన్ మన్సూర్ అలీఖాన్ టీడీపీ సిటీ అధ్యక్షుడిగా, జనరల్ సెక్రెటరీగా ముక్కెర సుబ్బారెడ్డిలతో కలిసి సిటీ కమిటీ ఏర్పాటుకు ఎమ్మెల్యే మాధవి రెడ్డి సిఫార్సులు చేసినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఆ పార్టీలోని సీనియర్లు కొందరు అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. జిల్లా కేంద్రంలో టీడీపీ జెండా మోసినోళ్లు కాదనీ, వేరే పార్టీ నుంచి టీడీపీలో చేరిన వారిచే సిటీ కమిటీ ఏర్పాటు చేయాల్సిన దౌర్భాగ్యం ఏమిటీ? అని కొందరు నిలదీసినట్లు తెలిసింది. ఏకంగా మంత్రి నారా లోకేష్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడంతో సిటీ కమిటీ నియామకం పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. మొత్తంగా పరిశీలిస్తే తెలుగుదేశం పార్టీలో అనైక్యత కొరవడి రగడ తీవ్రస్థాయికి చేరిందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

బాల్య వివాహాలను కట్టడి చేద్దాం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రమాదేవి

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఐసీడీఎస్ పీడీ రమాదేవి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా బాలల రీసోర్స్ సెంటర్‌లో సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు మిషన్ శక్తి పథకంపై పది రోజుల కార్యక్రమంలో భాగంగా తొలిరోజు కార్యక్రమాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ బాల్య వివాహాలు అనేక అనర్థాలకు దారి తీస్తాయని సూచించారు. మిషన్ వాత్సల్య పథకం ద్వారా చిన్నారులను చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని ఆమె సూచించారు. సీడీపీఓలు శ్రీలత, సునీత, శ్రీదేవి, జిల్లా మిషన్ శక్తి కోఆర్డినేటర్ శోభారాణి, డీసీపీఓ సుభాష్ యాదవ్, సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని, కౌన్సిలర్ పర్వీన్‌బాబు పాల్గొన్నారు.

14న బాస్కెట్ బాల్ జిల్లా స్థాయి ఎంపికలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 14న జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని జయనగర్ కాలనీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సీనియర్స్ బాల బాలికల జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సహదేవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డుతో ఎంపికలకు హాజరుకావాలన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 7 నుంచి 10 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

నేపాల్‌లోని తెలుగువారి రక్షణకు చర్యలు

కలెక్టరేట్ కంట్రోల్ రూము
08562-246344

నేపాల్‌లో చిక్కుకున్న వారు వివరాలు పొందుపరిచేందుకు ఏర్పాటు చేసిన స్కానర్

కడప సెవెన్‌రోడ్స్: నేపాల్‌లో జరుగుతున్న హింసాత్మక సంఘటనల నేపథ్యంలో అక్కడున్న తెలుగు వారిని సురక్షితంగా వెనక్కు తీసుకు వచ్చేందుకోసం వైఎస్సార్ కడపజిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము నెంబరు 08562–246344 ఏర్పాటు చేసింది. నేపాల్‌లో ఉన్న భారతీయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా హెల్ప్ లైన్ నెంబర్లను ఏర్పాటుచేసినట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రజల కోసం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో హెల్ప్‌లైన్ నెంబర్లు 98183 95787, 85000 27678 ఏర్పాటు చేశారు. ఇవి కాకుండా ఏపీఎస్ ఆర్టీఎస్ హెల్ప్‌లైన్ నెంబరు 0863 2340 678 సైతం అందుబాటులో ఉంటుంది. నేపాల్‌లో చిక్కుకున్న వారి వివరాలు పొందుపరిచేందుకు స్కానర్ సైతం అందుబాటులోకి తీసుకు వచ్చారు.

బీసీ వెల్ఫేర్ హెచ్‌డబ్ల్యూఓ అసోసియేషన్ ఎన్నిక

కడప రూరల్: జిల్లా బీసీ సంక్షేమ శాఖ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం స్థానిక బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో మాజీ జిల్లా అధ్యక్షుడు ఎం రామలింగేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా కే జయప్రసాదరాజు, గౌరవాధ్యక్షుడిగా వి రాజబాబు, ప్రధాన కార్యదర్శిగా జీ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఎస్ ప్రసాద్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు ఆ శాఖ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



నూతనంగా ఎన్నికైన జిల్లా బీసీ వెల్ఫేర్ హెచ్‌డబ్ల్యూఓ అసోసియేషన్ సభ్యులు

'అన్నదాత పోరు' గ్రాండ్ సక్సెస్

- పోలీసులు నోటీసులిచ్చి బెదిరించినా రైతులు వెనకడుగు వేయలేదు
- ప్రభుత్వం రైతులకు అడుగడుగునా మోసం చేసింది
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు చేపట్టిన 'అన్నదాత పోరు' గ్రాండ్ సక్సెస్ అయ్యిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అన్నదాత పోరు'ను అడ్డుకోవాలని ప్రభుత్వం పోలీసుల ద్వారా నోటీసులు ఇప్పించి, కేసులు పెడతామని బెదిరించినా రైతులు, రైతు కార్మికులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వాటికి లొంగకుండా రోడ్లపైకి వచ్చారన్నారు. వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. శాంతియుతంగా ర్యాలీ చేస్తామని చెప్పినా .. పోలీసులు అడుగడుగునా అడ్డుకుని ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలని చూశారన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయకపోతే ప్రభుత్వాన్ని దించే పరిస్థితి రావాలన్నారు. వ్యవసాయానికి సంబంధించి ముందస్తు ప్రణాళిక అనేదే లేకుండా ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. రాష్ట్రానికి 8లక్షల టన్నుల యూరియా కావాల్సి ఉంటే ముందే ప్లాన్ చేసి ఏప్రిల్, మే నెలల్లోనే కేంద్రానికి ఇండెంట్ ఇవ్వకుండా తాత్సారం చేసిందన్నారు. తీరా రైతులకు యూరియా అవసరమయ్యే సమయానికి ప్రభుత్వం వద్ద నిల్వలు లేవని, దీంతో ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు యూరియా వేసిన వరి తింటే కేన్సర్ వస్తుందని చెప్పడం సరికాదన్నారు. అలాగే 100 శాతం యూరియాను ప్రైవేటు డీలర్లకే అప్పగించడం వల్ల రూ.270కి అమ్మాల్సిన క్వింటా యూరియాను రూ.700–800లకు అమ్ముతున్నారన్నారు. ఇందులో సుమారు రూ.400కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలను ఉపయోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వారం పదిరోజుల్లోనే 15 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. అడుగడుగునా ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తూనే ఉందన్నారు.

ఎవరిని మభ్యపెట్టడానికి ఈ సభలు...?

సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్ అయ్యాయని కూటమి పార్టీల నేతలు సభ నిర్వహించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇంకా ఎవరిని మభ్యపెట్టడానికి ఈ సభలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. పింఛన్ రూ.4వేలకు పెంచి 5లక్షల పింఛన్లు తొలగించారని, 19 ఏళ్లు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇవ్వలేదని, నిరుద్యోగ భృతి అసలే లేదన్నారు. సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పార్టీ నేతలు పులి సునీల్‌కుమార్, బీహెచ్ ఇలియాస్ పాల్గొన్నారు.

ప్రతిభకు ఉపకారం

- ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తులకు వేళాయే
- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రోత్సాహకాలు
- ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సాయం
- అన్ని ప్రభుత్వ యాజమాన్యాల్లో 8వ తరగతి విద్యార్థులు అర్హులు
- ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- సెప్టెంబర్ 30వ తేదీ వరకు గడువు
- డిసెంబర్ 7న రాత పరీక్ష



పాఠాలను బోధిస్తున్న ఉపాధ్యాయుడు(ఫైల్)

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ బడుల్లో గ్రామీణ,పేద,మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలే అధికంగా చదువుతుంటారు. చాలా మంది విద్యార్థులు ఆర్థిక కారణాలతో మధ్యలో బడి మానేసి విద్యకు దూరవుతున్నారు. దీంతో ప్రతిభావంతులైన పేద విద్యార్థులు చదువులు కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం ఉపకారవేతనం అందిస్తూ చేయూతనిస్తోంది. ఇందుకు ఏటా నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తోంది. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. ఇందులో అర్హత సాధిస్తే తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాలుగేళ్ల ఏటా రూ.12 వేల చొప్పున ఉపకారవేతనం అందుతుంది. దరఖాస్తుకు ఈనెల 4నుంచి 30వ తేదీ తుది గడువు విధించారు. పరీక్ష డిసెంబర్ 7వతేదీ నిర్వహిస్తారు.

ఎవరు అర్హులు: ప్రస్తుతం 8వ తరగతి చదువుతూ 7 వ తరగతిలో ఓసీ,బీసీలైతే 55 శాతం, ఎస్సీ,ఎస్టీలైతే 50 శాతం మార్కులు లేదా దానికి సమానమైన గ్రేడ్ పొందిన వారు అర్హులు. విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించరాదు. ప్రభుత్వ ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో రెగ్యులర్‌గా చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ పాఠశాలలు ,రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అవకాశం ఉంది. ఈ ఏడాది ఎనిమిదో తరగతి విద్యార్థులు WWW.bse.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఏడాదికి రూ.12 వేలు

ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నవారు ఈ పారితోషికానికి ఎంపికైతే 9 నుంచి 12వ తరగతి వరకు ఉపకారవేతనం అందుతుంది. ఏడాదికి రూ.12వేల చొప్పున మొత్తం రూ.48 వేలు ఇవ్వనున్నారు. విద్యార్థులు ఏదైనా జాతీయ బ్యాంకులో ఖాతా తీసి వివరాలు సమర్పిస్తే నేరుగా వారి ఖాతాలో జమచేస్తారు.

జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మేనేజ్‌మెంట్ వారీగా ...

మేనేజ్‌మెంట్	విద్యార్థుల సంఖ్య
ఎంపీపీ, జెడ్పీ స్కూళ్లు	7698
ప్రభుత్వ స్కూళ్లు	503
మున్సిపల్ స్కూళ్లు	1563
ఎయిడెడ్ స్కూళ్లు	423
ఓరియంటల్ స్కూళ్లు	171
ఏపీ మోడల్ స్కూళ్లు	276

ఎన్‌ఎంఎంఎస్ సమాచారం ఇలా..

- ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ: 04-09-25
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి చివరితేదీ : 30.09.25
- దరఖాస్తుకు వెబ్‌సైట్: WWW.bse.gov.in
- పరీక్ష ఫీజు వివరాలు ఓసీ, బీసీ విద్యార్థులకు ఫీజు: రూ.100
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు: రూ.50 (ఎస్‌బిఐ కలెక్ట్ లింక్ ద్వారా)
- ఎన్‌ఎంఎంఎస్ రాత పరీక్ష: 07.12.2025

పరీక్ష విధానం



రాష్ట్ర స్థాయిలో జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని విభాగాల వారీగా అర్హుల జాబితాను రూపొందిస్తారు. ఇందులో రెండు ప్రశ్నపత్రాలు ఉంటాయి. మూడు గంటల పాటు పరీక్ష సమయాన్ని కేటాయించారు.

మెంటల్ ఎబిలిటీ పరీక్ష: వెర్బల్, నాన్ వెర్బల్, రీజనింగ్ నుంచి 90 ప్రశ్నలుంటాయి. దీనికి 90 మార్కులు

స్కాలిసిస్ అప్టిట్యూట్ పరీక్ష: ఇందులో 7,8 తరగతుల స్థాయిలో నేర్చుకున్న గణితం, సామాన్య,సాంఘిక విషయాలపై ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 180 మార్కులు.

పేద విద్యార్థులకు చక్కటి అవకాశం



కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకు ఉపయుక్తంగా ఉంటుంది. విద్యార్థులు బాగా చదువుకుని పరీక్షలో ప్రతిభ చూపితే నాలుగేళ్లపాటు ఆర్థిక వెసలుబాటు ఉంటుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. – షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి

బస్సుల్లేక ఎన్ని తిప్పలో!



అనంతపురంలో నిర్వహించిన కూటమి ప్రభుత్వ సూపర్‌సిక్స్ విజయోత్సవ సభకు జిల్లాలోని డిపోల నుంచి 320 బస్సులు వెళ్లాయి. జిల్లాలో మొత్తం 619 ఆర్టీసీ బస్సులు ఉండగా, అందులో 50 శాతం సర్వీసుల అక్కడికే తరలించారు. దీంతో జిల్లా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముందస్తు సమాచారం లేకుండా అధికారులు ఇలా అడ్డదిడ్డంగా బస్సులను పక్క జిల్లాకు తరలించడంపై పలువురు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
–కడప కోటిరెడ్డిసర్కిల్

నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన భోజనపల్లి భారతిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.



క్లుప్తంగా

కొండాపురంలో ఆగిన ఎక్స్‌ప్రెస్ రైళ్లు



పూజలు చేస్తున్న ప్రజాసంఘాలనాయకులు

కొండాపురం : కొండాపురం రైల్వేస్టేషన్‌లో బుధవారం ఉదయం కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలు ఆగింది. మనోహర్‌బాబు ఆధ్వర్యంలో రైలుకు పూజలు నిర్వహించారు. కన్యాకమారి– పూణే మధ్య నడిచే 16381,16382 ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి స్టాపింగ్ చేయించడంతో కొండాపురం ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జయంతిఎక్స్ ప్రెస్ నిలుపుదలకు కృషి చేసిన కడపఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డికి ఎల్లనూరు, కొండాపురం,సింహాద్రిపురం మండల ప్రజలు అభినందనలు తెలిపారు.

12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ప్రకటించాలి



సభ్యత్వ నమోదు చేయిస్తున్న శ్యాంసుందర్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఉన్నత పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ వారికి మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఈ నెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఏపీటీఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపడుతోందన్నారు. 11న నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు, 12న మండల కేంద్రాల్లో నిరసన, 13, 14న ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల సమర్పణ, 15న పాత తాలూకా కేంద్రాల్లో నిరసన, 16న జిల్లా కేంద్రాల్లో నిరసన, 17న సీఎంకు మెయిల్స్ ద్వారా విజ్ఞాపనలు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, సయ్యద్ బాషా, వెంకటేశ్వర్లు, ఖాజాపీరా, వరప్రసాద్ రెడ్డి, అబ్దుల్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే నగల చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న అర్బన్ సీఐ లింగప్ప

బద్వేలు అర్బన్ : ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లాలంటే పట్టణ వాసులు భయపడిపోతున్నారు. అలా తాళం పడిందో లేదో.. ఇలా దొంగలు చొరబడి ఉన్నదంతా దోచేస్తున్నారు. రాత్రి పూట కాకుండా పట్టపగలే చోరీలకు పాల్పడుతూ రెచ్చిపోతున్నారు. పట్టణంలోని వెంకటయ్యనగర్‌లో బుధవారం మధ్యాహ్నం తాళం వేసిన ఓ ఇంటిలో దొంగలు చొరబడి 12.50 తులాల బంగారు నగలు, 100 గ్రాముల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని వెంకటయ్యనగర్‌లో సునీత, శ్రీనివాసులు దంపతులు నివశిస్తున్నారు. శ్రీనివాసులు ఉదయమే బయటికి వెళ్లగా, మధ్యాహ్నం సమయంలో సునీత పక్కవీధిలోని తండ్రి ఇంటికి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళం పగులకొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువా తలుపులు పగులకొట్టి లాకరులో దాచిన 12.50 తులాల బంగారు నగలు, వంద గ్రాముల వెండి ఆభరణాలు అపహరించుకువెళ్లారు. గంట తర్వాత ఇంటికి వచ్చిన సునీత చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని అర్బన్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ లింగప్ప ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వేలిముద్రలు సేకరించారు.

ప్రబలుతున్న జ్వరం...
వణుకుతున్న జనం



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు ఓర్సువెంకటమ్మ. అట్లూరు మండలం వలస పాలెం గ్రామానికి చెందిన ఈమె గత 5 రోజులుగా జ్వరం, ఒళ్లునొప్పులతో బాధపడుతోంది. స్థానిక పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు చేయించుకున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. ఇక్కడ వైద్యుల కొరతతో గంటల తరబడి వేచి ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడుతోంది.

- అన్నింటా ప్రబలుతున్న విష జ్వరాలు
- కిక్కిరిసిన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు
- ప్రభుత్వాస్పత్రిలో వేధిస్తున్న వైద్యుల కొరత



ప్రభుత్వాసుపత్రిలో ఓపీ కోసం బారులు తీరిన జ్వరపీడితులు



చిన్న పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులు

బద్వేలు అర్బన్/ప్రొద్దుటూరు క్రైం : బద్వేల్ పట్టణంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఏ వార్డులో చూసినా ఇంటికి ఒకరు, ఇద్దరు చొప్పున జ్వర పీడితులు చికిత్సకు రావడంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయి. వైద్యుల కొరత ఉండడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. గత వారం రోజుల్లో బద్వేల్ ప్రభుత్వాసుపత్రిలో 250 నుండి 400 ఓపీ నమోదవుతుండటం పరిస్థితికి అద్దంపడుతోంది. ఏ ప్రైవేటు ఆసుపత్రి చూసినా జ్వరపీడితులు దర్శనమిస్తున్నారు. ఆస్పత్రి కిటకిటలాడుతున్నా తగినంతమంది వైద్యులు లేకపోవడం రోగులకు శాపంగా మారింది. ప్రభుత్వ ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో 12 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, ఆరుగురే ఉన్నారు. వీరిలోనూ ఒకరు డిప్యూటేషన్‌పై వారంలో రెండు రోజులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. దీనికి తోడు రక్త పరీక్షలు నిర్వహించే యంత్రం మరమ్మతులకు గురికావడంతో రోగుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. రక్తనమూనాలు సేకరించి గాంధీనగర్ అర్బన్ హెల్త్‌సెంటర్‌లో పరీక్ష చేయిస్తుండడంతో ఇబ్బంది పడుతున్నారు.

కిక్కిరిసిన చిన్నపిల్లల వార్డు

ప్రొద్దుటూరు, పరిసర ప్రాంతాల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. జిల్లా ఆస్పత్రిలో రోజూ సుమారు 1100 దాకా ఓపీ నమోదవుతోంది. మరో వైపు రాజుపాళెం, కామనూరు, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోనూ ఓపీ పెరిగింది. కొన్ని రోజులుగా రాత్రింబవళ్లు వర్షాలు పడుతుండడం, పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంతో పలువురు జ్వరాల బారిన పడి ఆస్పత్రికి వస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిట లాడుతున్నాయి. ఎక్కువమంది చిన్నారులు జ్వరం, జలుబు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారు. జిల్లా ఆస్పత్రిలో చిన్నపిల్లల వార్డు కిటకిటలాడుతోంది. 20 మంచాలు మాత్రమే ఉండడంతో 30 మంది చిన్నారులు చికిత్స తీసుకుంటున్నారు. మంచాల కొరత కారణంగా ఒక్కో మంచంలో ఇద్దరిని పడుకోబెట్టి చికిత్స అందిస్తున్నారు. ప్రైవేటుగా మరింతమంది చికిత్స పొందుతున్నారు. రక్త పరీక్షల కోసమే వేల రూపాయలు చెల్లించాల్సి వస్తోందని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు.

జ్వరంతో ఇబ్బంది పడుతున్నాం



గత మూడు రోజులుగా జ్వరం, ఒళ్లు నొప్పులతో ఇబ్బందులు పడుతున్నా. చికిత్స చేయించుకుంటున్నా జ్వరం తగ్గడం లేదు. మా వీధిలో చాలా మందికి జ్వరాలు వచ్చాయి. ఏ జ్వరమో అర్థం కావడం లేదు.

– రమణమ్మ, ఎగువ బ్రాహ్మణవీధి, బద్వేల్

గంటల తరబడి నిరీక్షణ



ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వచ్చి గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. తగినంత మంది వైద్యులు లేని కారణంగా సకాలంలో సేవలు అందడం లేదు. ఐదు రోజులుగా జ్వరం వస్తూనే ఉంది. మందులు తీసుకుంటున్నా తగ్గడం లేదు.

– వెంకటసుబ్బయ్య, రాజుగారివీధి, బద్వేల్

చిన్న పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



చిన్న పిల్లల్లో దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలు కనిపిస్తున్నాయి. కొందరు డయేరియాతో బాధపడుతున్నారు. ముందు జాగ్రత్తగా కాచి చల్లార్చిన నీటిని పిల్లలకు తాగించాలి. ముఖ్యంగా దోమలు కుట్టకుండా రాత్రివేళల్లో దోమ తెరలను వాడాలి. చల్లటివి కాకుండా వేడి పదార్థాలను భుజించాలి. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే హాస్పిటల్‌కు వెళ్లాలి.

– డాక్టర్ ఆనంద్‌బాబు, చిన్నపిల్లల వైద్యుడు, జిల్లా ఆస్పత్రి

గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ

ఇద్దరు వ్యక్తుల దుర్మరణం



లారీ దూసుకెళ్లడంతో మృతిచెందిన గొర్రెలు





మృతిచెందిన వెంకటేశ్వర్లు, నరసింహులు

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు–తాడిపత్రి రహదారిపై ఓ లారీ భీబత్సం సృష్టించింది. వేగంగా వస్తూ రహదారిపై వెళ్తున్న గొర్రెల మంద పైకి దూసుకెళ్లింది. వాటిని మేపే ఇద్దరు గొర్రెల కాపరులపై వెళ్లడంతో వారు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. 15 గొర్రెలు మృతి చెందాయి. ఎస్ఐ రామకృష్ణ వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ తాలూకా నల్లవాగుపల్లెకు చెందిన వెంకటేశ్వర్లు(45), ఆలమూరు గ్రామానికి చెందిన నరసింహులు(35) తమ యజమాని క్రిష్ణయ్యకు చెందిన గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం రాత్రి గండికోట ప్రాంతంలో గొర్రెలు మేపి స్వగ్రామానికి యజమాని క్రిష్ణయ్యతో కలిసి బయలుదేరారు. బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో బైపాస్ రోడ్డులో వెనుకవైపు నుంచి అతి వేగంగా గుర్తుతెలియని లారీ దూసుకువచ్చి ఢీకొంది. ఈ సంఘటనలో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందగా, నరసింహులును ప్రొద్దుటూరు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందారు. యజమాని క్రిష్ణయ్య ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. 15 గొర్రెలు మృతిచెందడంతో దాదాపు రూ. 2.50 లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని, మృతుల కుటుంబాలకు అన్యాయం జరిగిందని క్రిష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి బోరున విలపించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని విచారిస్తున్నట్లు పట్టణ ఎస్ఐ తెలిపారు.

అయ్యా.. ఇవ్వండి యూరియా

జేడీఏను చుట్టుముట్టి నిలదీసిన రైతులు



అల్లాడుపల్లెలో జేడీఏను చుట్టుముట్టిన రైతులు

చాపాడు : అయ్యా.. ఇవ్వండి యూరియా అంటూ మండలంలోని అల్లాడుపల్లెకు వచ్చిన వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ చంద్రానాయక్‌ను అల్లాడుపల్లె, లక్ష్మీపేట, శ్రీరాములపేట, పెద్ద గురవలూరు గ్రామాల రైతులు నిలదీశారు. జేడీఏను చుట్టుముట్టి యూరియా కోసం తాము పడుతున్న అవస్థలు విన్నవించారు. రైతుసేవా కేంద్రాల ద్వారా యూరియా తెప్పించి సరిపడేంత అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రైవేట్ దుకాణాల్లో బస్తా రూ.400–500 వరకు పెట్టి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఒక బస్తా ఇస్తే పంటలు ఎలా సాగు చేయాలని వారు ప్రశ్నించారు. దీనికి స్పందించిన జేడీఏ మాట్లాడుతూ యూరియా వాడకాన్ని వరిపైరులో తగ్గించాలని, ఎకరాకు 75 కిలోలు మూడు విడతల్లో అందించుకోవాలని సూచించారు. మాములు యూరియా బదులు నానో యూరియా వాడితే డబ్బు ఆదా అవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కృష్ణమూర్తి, వ్యవసాయాధికారి దేవీపద్మలత, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలను కాపాడుకుందాం



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ శివదాసన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన ప్రభుత్వ రంగ సంస్థలు ఎల్ఐసీని, జాతీయ బ్యాంకులను కేంద్ర ప్రభుత్వ విధానాలు బలహీన పరుస్తున్నాయని సీపీఎం రాజ్యసభ సభ్యుడు శివదాసన్ తీవ్రంగా విమర్శించారు. సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి అధ్యక్షతన బుధవారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల సెమినార్ లో సీపీఎం రాజ్యసభ్యులు శివదాసన్ మాట్లాడుతూ దేశంలో యూనివర్సిటీలలో రెగ్యులర్ ఫ్యాకల్టీ లేరని, విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గిపోయాయని అన్నారు. ఆరోగ్య రంగంలో కేటాయింపులు తగ్గిపోవడం వల్ల చిన్న సమస్యలు కూడా నియంత్రించలేని స్థితి నెలకొందన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి టీడీపీ, వైఎస్సార్ సీపీ మద్దతు ఇస్తున్నాయని అన్నారు. ప్రభుత్వాలు విగ్రహాలకు వందల కోట్లు ఖర్చు పెడుతున్నాయని, కానీ స్కూళ్లను, హాస్పిటల్స్‌ను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ వ్యవస్థలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై, ప్రజాప్రతినిధులపై ఉందని, పెన్షన్ సదుపాయం అన్నది రాజ్యాంగ హక్కు అని పాలకులు గుర్తించాలని అన్నారు. కేరళ తరహా ప్రత్యామ్నాయ విధానాల కోసం అంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. అవధానం శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి రాజా, నాగమునిరెడ్డి, రాజశేఖర్ రాహుల్, రవి తేజ, ఎస్.శివశంకర్ , రామ్మూర్తి నాయుడు, అజీజ్, లలిత, రామకృష్ణారెడ్డి, సుధాకర్, వెంకటరామరాజు పాల్గొన్నారు.

ఆదివాసుల హక్కుల కోసం
స్టాన్‌స్వామి పోరాటం



మాట్లాడుతున్న జేవీవీ జిల్లా యూత్ కన్వీనర్ హేమంత్ కుమార్

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆదివాసుల హక్కుల కోసం ఫాదర్ స్టాన్‌స్వామి తన జీవితాంతం పోరాటం చేశారని జన విజ్ఞాన వేదిక జిల్లా యూత్ కన్వీనర్ హేమంత్ కుమార్ తెలిపారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో మానవ హక్కుల కార్యకర్త ఫాదర్ స్టాన్ స్వామి జైలులో రాసిన 'మౌన ప్రేక్షకుణ్ణి కాను' పుస్తక పరిచయ సభ బుధవారం నిర్వహించారు. కవి మహమూద్ అధ్యక్షతన జరిగిన ఈ సందర్భంగా హేమంత్‌కుమార్ మాట్లాడుతూ ఆదివాసుల గ్రామసభ అనుమతి లేనిదే ఎవరు భూములు కొనడానికి వీలులేదని అన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని గత ప్రభుత్వాలు తుంగలో తొక్కాయన్నారు. కనీస వసతులు కల్పించకుండా జైలులో ఆయన చనిపోవడానికి కారణమయ్యారన్నారు. మిత్రజ్యోతి సాహితీ సంస్థ కన్వీనర్ మహమూద్ మాట్లాడుతూ ప్రస్తుత సామాజిక స్థితికి పుస్తకం అద్దం పడుతుందని, హక్కుల కోసం గొంతెత్తితే ఎటువంటి వారైనా కఠిన పరిస్థితులను ఎదుర్కోవాల్సిందేనని చెబుతోందని అన్నారు. విరసం కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ ఈ పుస్తకం భీమా కొరేగాం అక్రమ కేసులో నిబంధించబడిన బుద్ధి జీవుల గొంతుక అని చెప్పారు. మధ్య భారతంలో కగార్ పేరుతో సహజ వనరులను తవ్వి తీయడానికి ఆదివాసులపై నరమేధం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకుడు తవ్వాసురేష్, రచయితలు దాదాహయత్, కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి, జింకా సుబ్రహ్మణ్యం, చైతన్య మహిళా సంఘం పద్మ, గోపీనాథ్‌రెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు, ఇన్నర్‌వీల్ భారతి, దేవానంద్, కొత్తపల్లి శ్రీను, పౌరహక్కుల సంఘం సురేష్, ప్రొఫెసర్ షఫీవుల్లా, హైమ, రాకేష్, బాల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



ఎమర్జెన్సీలో కూడా ఇలా లేదు..



నేను ఎమర్జెన్సీ రోజులను ప్రత్యక్షంగా చూసిన అనుభవంతో చెబుతున్నాను. ఆరోజుల్లో పత్రికలపై సెన్సార్‌షిప్ మాత్రమే ఉండేది. ఇప్పటిలాగా సాక్షి పత్రికా కార్యాలయాలు, పాత్రికేయులపై ప్రత్యక్ష దాడులకు పా ల్పడటం, కేసులు నమోదు చేయడం వంటివి చూడలేదు. వ్యక్తులు లేదా ప్రభుత్వంపై ఏవైనా వ్యతిరేక వార్తలు వచ్చిన సందర్భాల్లో వాటిని ఖండించాలి. నిజానిజాలేవో తెలియజేస్తూ ప్రకటనలు ఇవ్వాలి. ఒక వేళ పత్రికా యాజమాన్యం స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఇలాంటి పద్ధతులను పక్కకు నెట్టి దాడులు, 'సాక్షి' ఎడిటర్‌పై కేసులు నమోదు చేయడం అంటే అది పూర్తిగా అప్రజాస్వామికమవుతుంది. ఇలాంటి ధోరణులను ప్రజాస్వామిక వాదులు ముక్తకంఠంతో ఖండించాలి.

– సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు, రాయలసీమ కార్మిక కర్షక సమితి, కడప

పత్రికా స్వేచ్ఛపై దాడిగా పరిగణించాలి



రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డిపై అక్రమ కేసులు బనాయించడం పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడిగానే పరిగణించాల్సి ఉంటుంది. ఓ నాయకుడు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన విషయాలను వార్తగా ప్రచురిస్తే కేసు నమోదు చేయడం గతంలో ఎన్నడూ చూడలేదు. డీఎస్పీల పదోన్నతుల్లో లంచాలు చోటుచేసుకున్నాయనే కథనంపై 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డిపై వరుస కేసులు నమోదు చేయడం పత్రికా స్వేచ్ఛను కోరుకునే వారంతా తీవ్రంగా ఖండించాల్సిన విషయం. ఒకవేళ 'సాక్షి'లో తప్పుడు కథనాలు ప్రచురితమయ్యాయని భావిస్తే వివరణ ఇవ్వాలి. నిజాలేవో వెల్లడించాలి. అంతేగానీ కేసులు, దాడులకు దిగడం రాజ్యాంగ హక్కులను కాలరాయడమే అవుతుంది.

– పి.రామసుబ్బారెడ్డి, రాష్ట్ర నాయకుడు, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన ఉన్నట్లు లేదు



రోజురోజుకూ రాష్ట్రంలో పత్రికలపై దాడులు పెచ్చరిల్లిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి వంటి అంశాలను వెలుగులోకి తీసుకు వస్తున్న 'సాక్షి'పై ప్రభుత్వం కక్షగట్టి దాడులు చేయిస్తోంది. ఓ ప్రెస్‌కాన్ఫరెన్స్ వార్తను రాసినందుకు ఎడిటర్‌కు నోటీసులు ఇవ్వడం చూస్తుంటే, రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ ఎలా ఉందో అర్థమవుతుంది. 'సాక్షి'లో వచ్చిన వార్తలకు ఖండన లేదా వివరణ లాంటివి ఇవ్వకుండా ఎడిటర్‌పై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేయాలనుకోవడం తగదు. పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడులను చూస్తుంటే రాష్ట్రంలో ప్రజాస్వామిక పాలన ఉన్నట్లు కనిపించడం లేదు. ఇలాంటి ప్రభుత్వ ధోరణులను ప్రతి ఒక్కరూ ఖండించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి.

– సి.వెంకటరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్

పాలకవర్గం పట్టు.. కమిషనర్ బెట్టు

- రెండో రోజున కొనసాగిన కౌన్సిల్ సమావేశం
- చైర్ పర్సన్ ఫిర్యాదుతో నిర్వహించిన కమిషనర్



బ్లాక్ రిబ్బన్ ధరించి మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : మున్సిపల్ పాలకవర్గం పట్టుబట్టి భీష్మించగా.. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తన బెట్టు వదలి రెండో రోజున బుధవారం ఎట్టకేలకు కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. దీంతో సమస్య పరిష్కారమైంది. అత్యవసర కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం సాయంత్రం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలోని ఒక అంశం చదివిన తర్వాత గత నెలలో ఎందుకు కౌన్సిల్ సమావేశం నిర్వహించలేకపోయారో కమిషనర్ సమాధానం చెప్పాలని చైర్ పర్సన్ ప్రశ్నించారు. ఫోన్ చేసినా స్పందన లేకపోవడం, వాట్సాప్ మెసేజ్ పెట్టినా పలకకపోవడానికి కారణమేమిటని అడిగారు. ఎక్స్‌అఫిషియో మెంబర్ హోదాలో హాజరైన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి స్పందించి మీ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన అవసరం కమిషనర్‌కు లేదని, ఆయన క్షమాపణ ఎందుకు చెబుతారు.. ఏమైనా ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోండి .. అంటూ అడ్డు చెప్పారు. కమిషనర్ కౌన్సిల్ సభ్యులందరికీ జవాబుదారీగా వ్యవహరించాలని.. గతంలో ఎమ్మెల్యే చెప్పిన విషయాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా ఈ సందర్భంగా గుర్తుచేశారు. బీసీ మహిళా చైర్ పర్సన్ అని చులకనగా చూస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. చైర్ పర్సన్‌కు కమిషనర్ సారీ చెప్పాల్సిందేనని వైఎస్సార్‌సీపీ మహిళా కౌన్సిలర్లు పోడియం వద్ద బైఠాయించారు. దీంతో కొంతమంది టీడీపీ సభ్యులు కమిషనర్‌కు మద్దతుగా బైఠాయించారు. వాగ్వాదాల మధ్య సభ జరుగుతుండగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అర్థంతరంగా బయటికి వెళ్లిపోయారు.

సమావేశం నుంచి వెళ్లిన కమిషనర్

కౌన్సిల్ సమావేశం జరుగుతుండగానే మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తోపాటు కిందివైపున ఉన్న తన ఛాంబర్‌కు వెళ్లిపోయారు. సమావేశం వాయిదా వేయకుండా, చైర్ పర్సన్ అనుమతి లేకుండా ఆయన ఎలా వెళ్లిపోతారని చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారుమునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు. తిరిగి కమిషనర్ సమావేశం జరిపే వరకు ఇక్కడే ఉంటామని హాల్‌లోనే రాత్రంతా గడిపి... అక్కడే భోజనాలు చేసి నిద్రకు ఉపక్రమించారు.

అరెస్టు చేసేందుకు పోలీసుల యత్నం

మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఉన్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లను, కౌన్సిలర్లను అరెస్టు చేసేందుకు రాత్రి పోలీసులు బెదిరింపులకు దిగారు. మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో పోలీసులు మీరు కౌన్సిల్ హాల్ నుండి వెళ్లిపోకుంటే అరెస్టు చేస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డితో అన్నారు. చైర్‌పర్సన్ అనుమతి లేకుండా పోలీసులు కౌన్సిల్ హాల్‌లోకి వచ్చేందుకే వీలులేదని, ఏ చట్ట ప్రకారం తమను అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. ఏ చర్యలు తీసుకువాలన్నా చైర్ పర్సన్ అనుమతి తీసుకోవాలని అనడంతో పోలీసులు వెళ్లిపోయారు. బుధవారం ఉదయం చైర్‌పర్సన్ పలుమార్లు అనంతపురంలోని మున్సిపల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. సమావేశం జరుపుతారా లేదా? అని అడిగారు. చైర్‌పర్సన్ ఫిర్యాదుతో ఆర్డీడీ కమిషనర్ ఆగ్రహంతో కమిషనర్, ఆర్ఓ, క్లర్క్‌లను సస్పెండ్ చేస్తామని హెచ్చరించినట్లు విశ్వసనీయ సమాచారం. లార్డీడీ ఆదేశాల మేరకు కమిషనర్ దిగి వచ్చి 20 గంటల తర్వాత మధ్యాహ్నం యథావిధిగా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. అజెండాలోను అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఎగ్జిబిషన్ గెజిట్‌ను సవరణ చేయాలని సూచించారు. సమావేశానికి కేవలం వైఎస్సార్‌సీపీ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా మాట్లాడుతూ సభా సాంప్రదాయం ప్రకారం కౌన్సిల్ సమావేశాలు నిర్వహించుకోవాలని, నిబంధనలను పాటించాలని సూచించారు. పంతాలకు, పట్టింపులకు పోతే నష్టపోయేది అధికారులేనన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కౌన్సిలర్లు చేపట్టిన నిరసనకు 13వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్ బాషా మద్దతు తెలిపారు.

పొరపాటు చేసిన కమిషనర్

మంగళవారం కౌన్సిల్ సమావేశం జరుగుతుండగా మధ్యలోనే ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వెంట వెళ్లిన కమిషనర్ పొరపాటు చేసి ఇరుక్కుపోయారు. ఎందుకు సమావేశం నుంచి మధ్యలో వెళ్లిపోయారని చైర్‌పర్సన్ ఫిర్యాదు చేయగా విధి నిర్వహణ సమయం దాటిపోయిందని (ఆఫీస్ అవర్స్) వెళ్లిపోయినట్లు కమిషనర్ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. దీంతో వైఎస్సార్‌సీపీ సభ్యులు బుధవారం ఆఫీస్ అవర్స్ ప్రారంభమయ్యాయని తిరిగి సమావేశం నిర్వహించాలని కోరారు. దీంతో కమిషనర్‌కు సందిగ్ధ పరిస్థితి ఏర్పడింది. సభ్యులందరు బ్లాక్ రిబ్బన్లు ధరించి కౌన్సిల్ హాల్‌లో నిరసన వ్యక్తం చేయడంతోపాటు సెల్ఫీ వీడియోల ద్వారా ఆర్డీడీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మళ్లీ కౌన్సిల్ సమావేశం జరిగింది.

వైఎస్సార్‌సీపీ నేత
శ్రీకాంత్ అక్రమ అరెస్టు

– ఎమ్మెల్యే ఆదేశాలతో తప్పుడు కేసులు పెడుతున్న పోలీసులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : దువ్వూరు మండలంలో వైఎస్సార్‌సీపీ నేతలపై అధికార పార్టీ నేతలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో తప్పుడు కేసులు పెట్టి పోలీసులు అక్రమ అరెస్టులు కొనసాగిస్తున్నారు. గత నెల 31న కానగూడూరుకు చెందిన టీడీపీ నేత తోట శేషయ్యపై దాడి చేసి తిట్టాడని మండలంలోని ఇడమడక గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత నగరి శ్రీకాంత్‌పై పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారు. అప్పటి నుండి నాలుగు పర్యాయాలు శ్రీకాంత్ స్థానిక పోలీసులకు ఫోన్ చేసి సార్ తాను స్టేషన్‌కు వస్తానని.. స్టేషన్ బెయిల్ ఇవ్వాలని తెలిపారు. స్పందించని పోలీసులు కాలయాపన చేస్తూ వచ్చారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో, ఎలాగైనా శ్రీకాంత్‌ను జైలుకు పంపాలనే ఉద్దేశంతో శ్రీకాంత్ భార్యకు ఆరోగ్యం బాగలేక కర్నూలు ఆస్పత్రిలో ఉంటే బుధవారం అక్కడికి వెళ్లి బలవతంగా అరెస్టు చేసి దువ్వూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సిన కేసులో తప్పుడు సెక్షన్లు జోడించి మైదుకూరు కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారు. ఇప్పటికే శ్రీకాంత్‌పై అధికార పార్టీ నేతలు ఎన్నో అకృత్యాలకు పాల్పడ్డారు. 20 ఏళ్లగా ఇడమక హైవే సమీపంలో డాబా పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ డాబాపై హైకోర్టులో కేసు నడుస్తున్నా అక్రమంగా కూల్చివేశారు. ఇదే క్రమంలో శ్రీకాంత్ బావ ముద్దం వీరభద్రుడుకు చెందిన డాబాను అధికార పార్టీ నేతలు కూల్చివేశారు. వైఎస్సార్‌సీపీ నేతల ఆస్తులు కూలగొట్టి అక్రమ కేసులో ఇరికించే లక్ష్యంగా అధికార పార్టీ నేతలు కుట్రలు పన్నుతున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ మహాదేవ హైవే రెస్టారెంట్ నందు పనిచేయటకు 1-2 సం॥ అనుభవం గల హెల్పర్స్ కావలెను. అడ్రస్ సాక్షి సర్కిల్ పులివెందుల రోడ్, కడప సంప్ర: ✆ 70133 82066

■స్పాట్ జాయినింగ్స్. మా కంపెనీలో టెలికాలర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, కౌన్సిలర్స్ & ఫీల్డ్ స్టాఫ్ కావలెను. Salary: 20,000 to 25,000. ✆ 9000180616.

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ వార్డెన్స్, లేడీ కేర్‌టేకర్స్, నర్సులు, కాంపౌండర్స్,వాచ్‌మెన్స్, సెక్యూరిటీ గార్డ్స్, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. 8985114453/ 9391036931

■ జిల్లాలో బ్యాంకుల్లో వర్క్ చేయుటకు అటెండర్స్, క్లర్క్స్, రికవరీ, క్యాష్ లోడింగ్, కం.ఆపరేటర్స్, క్యాషియర్స్, అసిస్టెంట్స్, జీ : 27000/-, Q: 10-డిగ్రీ. 8297349403

■ వృద్ధులు కాదు,VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ. 15వేల -40వేల,ఫ్రీరూం+భోజనం,Hyd.7995365999

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక